సాక్షి అనకాపల్లి

సోమవారం । 9 । అక్టోబర్ । 2023



జూలో మారథాన్

ఇందిరాగాంధీ జూ పార్కులో వన్యప్రాణి వారోత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సాహంగా మారథాన్ జరిగింది 8లో



వెటరన్ క్రీడాకారుల సత్తా

జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్‌లో వెటరన్ క్రీడాకారులు సత్తా చాటారు. విశాఖ పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో ఈ పోటీలు జరిగాయి. 8లో



ఇరువర్గాల మధ్య ఘర్షణ

తామరబ్బలో ఇంటి స్థల వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. 8లో

న్యూస్‌రీల్

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు రేపు

అనకాపల్లిటౌన్: స్థానిక గుండాల జంక్షన్ జీవీఎంసీ కల్యాణమండపంలో ఈ నెల 10న ఉదయం 9 గంటలకు బాల్యవివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సీడీపీవో కె.ప్రభావతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, స్త్రీ శిశు సంక్షేమశాఖ, జీవీఎంసీ పరిధిలో వార్డుల మహిళా సంరక్షణ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, వార్డు వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, ఆర్‌పీలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు బాల్య వివాహాల నిషేధ చట్టం-2006, జీవో నెం.31పై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. మధ్యాహ్నం 2 గంటలకు వేల్పులవీధి జీవీఎంసీ టౌన్ గర్ల్స్ హైస్కూల్‌లో జిల్లావిద్యాశాఖాధికారి పర్యవేక్షణలో బాలల హక్కుల పరిరక్షణలో ఎంఈవోల పాత్ర అనే అంశంపై కూడా సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

తాండవ నీటిని పొదుపుగా వాడాలి

ప్రాజెక్టు నాతవరం సెక్షన్ జేఈ శ్యామ్‌కుమార్

నాతవరం: తాండవ రిజర్వాయర్‌లో నీటి నిల్వలు తక్కువగా ఉన్నందున ఆయకట్టుదారులు వృథా చేయకుండా పొదుపుగా వినియోగించాలని నాతవరం సెక్షన్ తాండవ ప్రాజెక్టు జేఈ శ్యామ్‌కుమార్ తెలిపారు. ప్రధాన కాలువల ద్వారా పంట పొలాలకు నీరు ఏ విధంగా ప్రవహిస్తుందో ఆదివారం ఆయన పరిశీలించి, రైతులకు సూచనలుచేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు తక్కువగా పడడం వల్ల రిజర్వాయర్‌లో నీటి మట్టం తక్కువగా ఉందన్నారు. ఆదివారం సాయంత్రానికి 361.4 అడుగుల నీరు ఉందని చెప్పారు. ప్రస్తుతం రెండు ప్రధాన కాలువల ద్వారా రోజుకు 550 క్యూసెక్కుల చొప్పున పొలాలకు విడుదల చేస్తున్నామన్నారు. శివారు ఆయకట్టుకు నీరు అందిస్తున్నామని, ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున కాలువల్లో నీటి ప్రవాహం అనుకున్నంత వేగంగా లేదని చెప్పారు. నీరు వృథాకాకుండా తమ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఉన్న నీరు నెల రోజులకు సరిపోతుందని, వర్షాలు పడి, తాండవలోకి నీరు చేరితే ఖరీఫ్ సాగుకు ధైర్యంగా ఉండవచ్చన్నారు. లేకపోతే ఇప్పుడున్న నీటిని రైతులంతా వృథా చేయకుండా వాడుకుంటునే ఖరీఫ్ సీజన్ గట్టెక్కుతామన్నారు.

వృత్తివిద్యా కోర్సులకు దరఖాస్తులు

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్ దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్‌లో వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణామూర్తి ఆదివారం తెలిపారు. డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్(స్త్రీలకు),టెక్స్ టైల్స్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్ (స్త్రీ,పురుషులు), మోటార్ వెహికల్ మెకానిక్ టూ వీలర్, ఫోర్ వీలర్ (పురుషులు), ఆఫీస్ అసిస్టెంట్ కం కంప్యూటర్ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణ ప్రారంభిస్తున్నామన్నారు. ఇవి ఏడాది కాలపరిమితి గల కోర్సులని,పదో తరగతి, ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణులైనవారు అర్హులన్నారు. వివరాలకు 9963340611 నంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

టీడీపీది దోపిడీ.. మనది సంక్షేమం

- 'ఏపీకి జగనే ఎందుకు కావాలి?'లో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి
- వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లతో భేటీ
- పాల్గొన్న ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ

రావికమతం: గత టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలతో దోపిడీకి పాల్పడితే, ప్రస్తుత సీఎం జగన్ మోహన్‌రెడ్డి నేతృత్వంలోని తమ ప్రభుత్వం వలంటీర్ల ద్వారా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేస్తోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. వలంటీర్ల ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు వస్తోందనే అక్కసుతోనే పచ్చ మీడియా, ప్రతిపక్షాలు వారికిపై కక్ష కట్టాయన్నారు. కొత్తకోట రవిటాకీస్‌లో సోమవారం డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ అధ్యక్షత రావికమతం, రోలుగుంట మండలాల వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు నిర్వహించిన 'ఏపీకి జగనే ఎందుకు కావాలి?' శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవరత్నాల పథకాల ద్వారా ద్వారా ప్రజలంతా సంతోషంగా ఉండేలా సీఎం జగన్ పాలన చేస్తున్నారని కొనియాడారు. ప్రజల నమ్మకాన్ని మరింతగా పెంచుకునేలా కొత్తకొత్త సంక్షేమ పథకాలతో సీఎం జగన్ ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకున్నట్లు పేర్కొన్నారు. కరోనా కాలంలో ప్రపంచ వ్యాప్తంగా బంధువులే పట్టించుకోని దుస్థితిలో జగనన్న ఏర్పాటు చేసిన వలంటీర్లు ఎలా పనిచేశారో, ప్రాణభయంతో పక్క రాష్ట్రాల్లో దాక్కున్న ప్రతిపక్షాలకు, పచ్చమీడియాకు తెలుసా? అని ప్రశ్నించారు. నాడు-నేడుతో ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్థాయికి మార్చారని కొనియాడారు. ప్రజలందరి ఆరోగ్యమే పరమావధిగా గత నెల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 15 వేల సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా స్పెషలిస్ట్ వైద్యులతో కీలక వైద్య పరీక్షలు నిర్వహించి, అత్యుత్తమ వైద్య సేవలందిస్తున్న విషయాన్ని వివరించారు. సీఎం జగన్ పాలనలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో పెనుమా ర్పులు వచ్చాయన్నారు. ఎంపీ బీవీ సత్యవతి మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో పాలకులంతా గ్రామ స్వరాజ్యం గురించి మాట్లాడినవారేనని, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అమలు చేసి చూపించారని తెలిపారు. 17 మెడికల్ కాలేజీలు అందుబాటులోకి రావడంలో సీఎం జగన్ కృషి ఎనలేనిదని కొనియాడారు. జిల్లాలోని మాకవరపాలెంలో రూ.550 కోట్లతో మెడికల్ కాలేజీ ఏర్పాటు హర్షణీయమన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ అలిపిరి సంఘటనతో నాడు సానుభూతి కోసం ప్రయత్నించిన చంద్రబాబు, మళ్లీ అదే దొడ్డిదారిన ప్రజల్ని తప్పుదోవ పట్టించేందుకు తనకున్న పచ్చ మీడియా ద్వారా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీన్ని తిప్పికొట్టాలన్నారు. చోడవరం నియోజక వర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.1,880 కోట్లతో సంక్షేమం, రూ.1800 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ప్యాకేజీ భజన సేన, పొత్తుల పార్టీలకు భయపడే కార్యకర్తలు తమలో లేరని, వచ్చే ఎన్నికల్లో విజయం తథ్యమన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ నవంబరు 1 నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంపై ప్రతి ఒక్కరూ దృష్టిసారించాలన్నారు. తమ ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరిందని నమ్మితేనో ఓటేయండని అడిగే దమ్మున్న ఏకైక నాయకుడు సీఎం జగన్ అని కొనియాడారు. నియోజకవర్గ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు మాట్లాడుతూ ప్రభుత్వ పనితీరును ప్రజలకు మరింతగా వివరించాలన్నారు. అంతకు ముందు వైవీ సుబ్బారెడ్డి భారీ ర్యాలీగా కొత్తకోట శివకేశవ ఆలయానికి వెళ్లారు. ఆలయ కమిటీ చైర్మన్ గుమ్ముడు దొరబాబు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు పోతల లక్ష్మీ శ్రీనివాసరావు, తలారి రమణమ్మ ఆదిమూర్తి, ఎంపీపీలు పైల రాజు, యర్రంశెట్టి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షులు అప్పలనాయుడు, మహాలక్ష్మినాయుడు, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు, చోడవరం మార్కెట్ కమిటీ చైర్మన్ ఏడువాక సత్యారావు, కొత్తకోట గ్రామ సర్పంచ్ కోన లోవరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ

ఏపీకి జగనే ఎందుకు కావాలి?

సీఎం జగన్ రాష్ట్రంలోని కోటీ 50 లక్షల కుటుంబాల్లో కోటీ 17 లక్షల కుటుంబాలకు సంక్షేమ ఫలాలను అందించారని ఆయన తెలిపారు. మళ్లీ సీఎంగా జగన్ గెలవకపోతే ఆ కుటుంబాలన్నీ అన్యాయమవుతాయని, అందుకే నవంబర్ 1 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 17 వేల సచివాలయాల పరిధిలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి?'అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అన్ని మండలాల్లో ఎంపీపీలు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు, జెడ్పీటీసీలు, సచివాలయ మండల కన్వీనర్లు ఇతర ముఖ్య నేతలు సచివాలయాలకు వెళ్లి ఈ నాలుగున్నరేళ్లలో ఆ సచివాలయ పరిధిలో ప్రభుత్వం ఎన్ని కోట్లు ఖర్చు చేసిందో ప్రదర్శించి, ప్రజలకు వివరించాల్సిందిగా సూచించారు. పార్టీ జెండా ఎగురవేసి, అన్ని సామాజిక వర్గాల నాయకులతో అభివృద్ధిపై చర్చించి, సహపంక్తి భోజనాలు చేయాలన్నారు. ఆ రాత్రికి అక్కడే బస చేసి, మర్నాడు ఉదయం వలంటీర్లు, గృహసారథులతో కలిసి కనీసం 10 ఇళ్లకు వెళ్లి, గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో 10, ప్రస్తుతం జగన్ ఇచ్చిన హామీల్లో 10 చూపించి, ఎవరి హయాంలో ఎక్కువ లబ్ధి చేకూరిందో, సీఎం జగన్ వారికి ఎలా అండగా నిలిచారో వివరించాలని సూచించారు. ప్రజల చేతనే నిజాలను నిర్ధారించాలని పేర్కొన్నారు. చోడవరం నియోజకవర్గంలో నాలుగు మండలాలకు ప్రాధాన్యత కలిగిన బీఎన్ రోడ్డును డిసెంబర్‌లోగా పూర్తి చేస్తామన్నారు.



కార్యక్రమానికి హాజరైన రెండు మండలాల వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు

పండగలా ప్రారంభోత్సవాలు



మర్రివలసలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, మంత్రులు బూడి, బొత్స, ఎంపీ సత్యవతి

- పలు నూతన భవనాలు ప్రారంభించిన వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం బూడి, మంత్రి బొత్స, ఎంపీ సత్యవతి
- రాష్ట్రంలోనే తొలిసారిగా మర్రివలసలో సంక్షేమం, అభివృద్ధి శిలాఫలకాల ఆవిష్కరణ
- రూ.5.55 కోట్లతో సంక్షేమ పథకాల అమలు, రూ.88 లక్షలతో నూతన భవనాల నిర్మాణం
- మరో రూ.3.5 కోట్లతో రోడ్లు, మంచినీటి కుళాయిలు, డ్రైనేజీ పనుల పూర్తి



భవనాల ప్రారంభానికి ర్యాలీగా వెళ్తున్న వైవీ సుబ్బారెడ్డి, బూడి ముత్యాలనాయుడు, సత్యవతి

కె.కోటపాడు/మాడుగుల: కె.కోటపాడు మండలం మర్రివలసలో నిర్మించిన పలు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవ కార్యక్రమాలు ఆదివారం పండగ వాతావరణంలో జరిగాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలను తెలుపుతూ శిలాఫలకాల ఆవిష్కరణ రాష్ట్రంలోనే తొలిసారిగా మర్రివలసలో నిర్వహించారు. మర్రివలసలో రూ.5.55 కోట్లతో సంక్షేమం పథకాల అమలు,రూ.88లక్షలతో నూతన భవనాల నిర్మాణం, మరో రూ.3.5 కోట్లతో రోడ్లు, మంచినీటి కుళాయిలు, డ్రైనేజీ పనులు జరిగాయి. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన పలుఅభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను ఆదివారం వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, డిప్యూటీ సీఎం ముత్యాల నాయుడు, మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ సత్యవతి ప్రారంభించారు. అనంతరం జల్‌జీవన్ మిషన్ నిధులతో ఏర్పాటుచేసిన ఇంటింటి కుళాయిల ప్రారంభోత్సవ కార్యక్రమానికి వీరు హాజరయ్యారు. భారీ ఎత్తున అభివృద్ధి పనులు జరగడంతో ఆ గ్రామస్తులు మురిసిపోయారు. ముందుగా మర్రివలస గ్రామానికి చేరుకున్న వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు బూడి ముత్యాలనాయుడు, బొత్స సత్యనారాయణలకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా హారతులు పడుతూ కోలాటాలతోను, పూలు జల్లుతూ ఘనంగా స్వాగతం పలికారు. అంతకు ముందు ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన గాంధీ, సరస్వతీ దేవీ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం రూ.41లక్షల ఏర్పాటు చేసిన ఇంటింటి కుళాయిలతో పాటు శిలాఫలకాన్ని వై.వి.సుబ్బారెడ్డి, మంత్రులు బూడి ముత్యాలనాయుడు, బొత్స సత్యనారాయణ, ఎంపీ బి.వి.సత్యవతి ప్రారంభించారు. అక్కడి నుంచి ర్యాలీ గా వెళ్లి నూతనంగా ఏర్పాటు చేసిన దివంగత సీఎం వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఒకే ప్రాంగణంలో రూ.88 లక్షలతో నిర్మించిన సచివాలయం, రైతు భరోసా, హెల్త్‌వెల్‌నెస్ భవనాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు, మహిళలు పాల్గొనడంతో గ్రామమంతా సందడిగా మారింది.

అభివృద్ధి పనుల శిలాఫలకం ఆవిష్కరణ

మర్రివలస సచివాలయం పరిధిలో జరిగిన అభివృద్ధి, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల నిధుల వివరాలతో ఏర్పాటుచేసిన శిలాఫలకాన్ని వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. ఇలా అభివృద్ధి పనుల వివరాలతో శిలాఫలకాన్ని ఆవిష్కరించడం రాష్ట్రంలోనే మొట్టమొదటి సారి. మర్రివలస సచివాలయంలో సీఎం జగన్ పాలనలో అభివృద్ధి, సంక్షేమానికి రూ.8,31,28,000 మంజూరైనట్టు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు తెలిపారు. సీఎం జగన్ ఆలోచనల మేరకు మొదటి సారిగా మర్రివలసలో ఈ శిలాఫలకాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, జెడ్పీటీసీ ఈర్లె అనురాధ, ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అల్లు సూర్యనారాయణ, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ద్వారపూడి శ్రీనివాస్, సర్పంచ్ పొంతపల్లి అప్పలనర్సమ్మ, ఎంపీటీసీ కోటాన అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం తీర్మానం

సాక్షి, విశాఖపట్నం : దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం రీజినల్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు కోరారు. విశాఖలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్చించారు. తమ సమస్యలను ముఖ్య అతిథిగా హాజరైన డిస్కమ్ సెక్రటరీ పీకేవీఎం లక్ష్మీరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన.. ఉద్యోగుల సమస్యలను డిస్కమ్‌ల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్పోర్ట్స్ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యుత్ ఉద్యోగులు అన్సర్ అలీ, మాధవ్‌లను శ్రీనివాసరావు సత్కరించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.హరిబాబు, ఎం శ్రీనివాసరావు, జోన్-2 బ్రాంచ్ అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, పి.త్రిమూర్తులు, స్టేట్ కంపెనీ అసిస్టెంట్ సెక్రటరీ రాజబాబు, డిస్కమ్ ట్రెజరర్ బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు

విశాఖ పోర్టుకు ఎనలేని ఖ్యాతి

తాటిచెట్లపాలెం: విశాఖ పోర్టు ట్రస్ట్ 90వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సాలగ్రామపురంలోని సీతారామ కళ్యాణమండపంలో హార్బర్ అండ్ పోర్ట్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన విశాఖపోర్టు ట్రస్ట్ మాజీ ట్రస్టీ బీసీహెచ్ మసేను మాట్లాడుతూ దేశంలోని అన్ని పోర్టులలో విశాఖ పోర్టుకు ఎంతో చరిత్ర ఉందని, ఉద్యోగుల సహకారంతో నేడు ఎంతగానో అభివృద్ధి చెందిందని తెలిపారు. పోర్టును కాపాడుకోవడానికి ప్రతి ఉద్యోగి ఉద్యమాలు చేయవలసిన సమయం ఆసన్నమైందని మసేను తెలిపారు. ఈ సందర్భంగా సినీ దర్శకుడు కె.వెంకటేశ్వరావును ఘనంగా సత్కరించారు.

నేటి నుంచి 'తపాలా బీమా ఏజెంట్ల'కు ఇంటర్వ్యూలు

అనకాపల్లి రూరల్: అనకాపల్లి పోస్టల్ డివిజన్ పరిధిలో తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా పాలసీలు చేయించేందుకు కొత్తగా ఏజెంట్ల నియామకం కోసం సోమవారం నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు డివిజన్ అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ సంజయ్ కుమార్ పాండా తెలిపారు. ఇంటర్మీడియెట్ కనీస విద్యార్హత కలిగి 18 నుంచి 65 ఏళ్ల లోపు వయసు ఉన్న నిరుద్యోగులు, స్వయం ఉపాధి పొందుతున్న వారు, పూర్వ బీమా ఏజెంట్లు(ఏదైనా బీమా సంస్థలో పనిచేసిన వారు),విశ్రాంత ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ వర్కర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, మాజీ సైనికోద్యోగులు, ఆసక్తి కలిగిన వారెవరైనా బీమా ఏజెంట్లుగా చేరడానికి అర్హులని తెలిపారు. ఆసక్తిగల వారు పూర్తి చేసిన దరఖాస్తు, ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటాతో సోమవారం నుంచి అనకాపల్లి పోస్టల్ డివిజన్ ప్రధాన కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జరగనున్న ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు. ఎంపికైన అభ్యర్థులు లైసెన్సు ఫీజుగా రూ.250 చెల్లించాలి. ఎంపికైన వారిని ప్రాథమికంగా 12 నెలల కాలపరిమితికి బీమా ఏజెంట్‌గా నియమిస్తూ ఐడీ కార్డు, ఏజెంట్ కోడ్‌తో లైసెన్సు జారీ చేస్తారు. అలాగే కొత్తగా నియమితులైన ఏజెంట్లకు మూడు రోజుల శిక్షణ ఇస్తారు. నియమించబడిన అభ్యర్థులు రూ.5 వేల సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఆ డబ్బుకు సరిపడా ఎన్ఎస్‌సీ బాండును ఏజెంట్ పేరున జారీ చేస్తామని సంజయ్ కుమార్ పాండా చెప్పారు.

సిరులు కురిపిస్తున్న డ్రాగన్ ఫ్రూట్

సంప్రదాయ పంటలతో ఆశించిన ఆదాయం రాకపోవడంతో జిల్లాలో రైతులు ఉద్యానవన పంటలపై దృష్టి సారిస్తున్నారు. విదేశీ పంటలు కూడా సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. ఒకసారి పెట్టుబడి పెడితే దీర్ఘకాలిక లాభాలిచ్చే డ్రాగన్‌ఫ్రూట్ పంటను సైతం సాగు చేస్తున్నారు.

- ఉమ్మడి విశాఖ జిల్లాలో 50 ఎకరాల విస్తీర్ణంలో సాగు
- అనకాపల్లి జిల్లాలో 20 ఎకరాల్లో పంట
- ఒకసారి నాటితే 25 ఏళ్ల వరకు దిగుబడి
- జిల్లాలో విస్తరిస్తున్న సాగు

దేవరాపల్లి: జిల్లాలో వర్షాధార భూముల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు సిరులు కురిపిస్తోంది. సంప్రదాయ పంటల కంటే డ్రాగన్ ఫ్రూట్ లాభదాయకంగా ఉండడంతో రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ఉష్ణజాతికి చెందిన (ఎడారి మొక్క) డ్రాగన్ ఫ్రూట్ దిగుబడి తక్కువ వర్షపాతం ఉండే ప్రాంతాల్లో ఆశాజనకంగా ఉంటుంది. అధిక పోషక విలువలు ఉండడంతో డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఈ పండు కిలో ధర నాణ్యతను బట్టి రూ. 150 నుంచి రూ. 200 వరకు పలుకుతోంది. దీంతో రైతులు దీని సాగుపై మక్కువ చూపుతున్నారు. ఉమ్మిడి విశాఖ జిల్లాలో సుమారు 50 ఎకరాల్లో సాగవుతోంది. అనకాపల్లి జిల్లాలో సుమారు 20 ఎకరాల్లో ఈ పంటను సాగు చేస్తున్నారు. వీటిలో వైట్, రెడ్ రకాలు ఉన్నాయి. పంట వేసిన ఏడాది తర్వాత నుంచి దిగుబడి ప్రారంభమై దీర్ఘకాలం 25 ఏళ్ల వరకు దిగుబడి ఇస్తుంది. ఏటా దిగుబడి పెరుగుతూ ఉంటుంది. సేంద్రియ ఎరువుల ద్వారా సాగు చేస్తే మరింత అధిక దిగుబడి వస్తుంది. ఈ పంటలకు తెగుళ్ల బెడద తక్కువగా ఉంటుంది. ఏటా జూన్ నుంచి అక్టోబర్ మధ్య పండు దిగుబడి వస్తుంది.

అనకాపల్లి జిల్లాలో దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల, చీడికాడ, అనకాపల్లి, కశింకోట, అచ్యుతాపురం, కోటవురట్ల, ఎస్.రాయవరం, పరవాడ, మాకవరపాలెం, రావికమతం తదితర మండలాల్లో ఈ పంటను సాగుచేస్తున్నారు.

సాగు విధానం..

త్వరగా ఎత్తు పెరిగే డ్రాగన్ ఫ్రూట్ మొక్కకు నిటారుగా ఎదగడానికి సిమెంట్ స్తంభాలను సపోర్ట్‌గా ఏర్పాటు చేయాలి. ఈ స్తంభాలపైన మొక్కలు అల్లుకునేందుకు వీలుగా గుండ్రటి, చతురస్రాకారంతో గొడుగుల్లాగా మొక్కలు పెరిగేలా సిమెంట్ నిర్మాణాలు ఏర్పాటు చేయాలి. ఏడు అడుగుల సిమెంట్ స్తంభాలను తీసుకొని రెండు అడుగుల లోతు భూమిలో పాతాలి. ఎకరాకు 450 నుంచి 500 వరకు స్తంభాలు ఏర్పాటు చేసి 1800 నుంచి 2వేల వరకు మొక్కలు నాటాలి. దీని సాగుకు తొలి ఏడాది మాత్రమే ఖర్చు ఉంటుంది. ఎకరాకు రూ. 4 నుంచి రూ. 5 లక్షల వరకు ఖర్చు అవుతుంది.

అధిక పోషక విలువలతో పాటు రుచికరంగా ఉండడంతో డ్రాగన్ ఫ్రూట్‌ను తినేందుకు ఇష్టపడతారు. పోషకాల స్టోర్ హౌస్‌గా పిలిచే డ్రాగన్ పండు ధర అధికంగా ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తారు. డ్రాగన్ ఫ్రూట్‌ను తరుచూ తినడం వల్ల గుండె ఆరోగ్యంగా ఉండడంతో పాటు గుండె జబ్బులు రాకుండా నివారిస్తుంది. క్యాన్సర్, సుగర్ తదితర దీర్ఘ కాలిక వ్యాధులు రాకుండా నివారిస్తుంది. మంచి కొలెస్ట్రాల్‌ను, రోగ నిరోధక శక్తిని పెంచి ఇన్‌ఫెక్షన్లు రాకుండా చేస్తుంది.



ఎస్.జి. నగరంలో సాగులో ఉన్న డ్రాగన్ ఫ్రూట్ పంట



డ్రాగన్ ఫ్రూట్

రెండున్నర ఎకరాల్లో సాగు చేస్తున్నాను



హైదరాబాద్‌లో ఒక్కో మొక్కను రూ. 80 చొప్పు కొనుగోలు చేశాను. రెండున్నర ఎకరాల్లో పంట వేశాను. సాగు సమయంలోనే ఖర్చు అధికంగా ఉంటుంది. ఏడాది తర్వాత దిగుబడి ప్రారంభమై సుమారు 25 ఏళ్ల వరకు వస్తుంది. ఏడాదిలో నాలుగు నెలలు పండుతుంది. వారానికి 1500 కిలోల పండ్ల దిగుబడి లభిస్తుంది. విశాఖ మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయిస్తాం, కొందరు వ్యాపారులు మా వద్దకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో డ్రాగన్ ఫ్రూట్‌కు మంచి డిమాండ్ ఉంది. ప్రభుత్వం ప్రోత్సహిస్తే సాగు మరింత పెరుగుతుంది.

– చిరికి అప్పలనాయుడు, ఎస్.జి.నగరం.

మంచి డిమాండ్



ఈ పంటకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో 12 మండలాల్లో సుమారు 20 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఉద్యాన వనశాఖ నుంచి హెక్టార్‌కు రూ.30 వేల చొప్పున ప్రోత్సాహకం అందిస్తున్నాం. వర్షాధార భూములు సాగుకు అనుకూలం. సాగు చేసే రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం.

–జి.ప్రభాకర్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి, అనకాపల్లి

క్లుప్తంగా

అగ్నిప్రమాదంలో బడ్డీకొట్టు దగ్ధం


అగ్నిప్రమాదంలో దగ్ధమవుతున్న బడ్డీ

మాకవరపాలెం: అగ్నిప్రమాదంలో ఒక బడ్డీ కొట్టు దగ్ధమైంది. మండలంలోని భీమబోయిన పాలెం శివారు గండిపేట జంక్షన్‌లో గండి అర్జునకు చెందిన బడ్డీకొట్టు ఆదివారం తెల్లవారు జామున కాలిపోయింది. భారీ ఎత్తున మంటలు చెలరేగిన విషయాన్ని గమనించిన స్థానికులు అదుపుచేసే ప్రయత్నం చేసినా ఫలితం లేకపోయింది. ఈ ప్రమాదంలో కమ్మల పందిరితోపాటు బడ్డీలో ఫ్రిజ్ ఇతర సామగ్రి మొత్తం దగ్ధమయ్యాయి. విద్యుత్ షార్ట్ షర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగిందని బాధితుడు తెలిపాడు. ఇదే జీవనాధారమని విలపించాడు.

పందెంరాయుళ్ల అరెస్టు

కోటవురట్ల: కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ నారాయణరావు వివరాల ప్రకారం... మండలంలోని ములగలలోవ శివారు జీడి తోటల్లో కోడి పందేలు ఆడుతున్నారన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఏడుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.6,400, రెండు పందెం కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎవరైనా పండగ నెపంతో జూదం, కోడిపందాలు నిర్వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ హెచ్చరించారు.

మురిసిన మర్రివలస

పలు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్సవాలతో కె.కోటపాడు మండలం మర్రివలస మురిసిపోయింది. గ్రామ చరిత్రలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. సంక్షేమ పాలనలో గ్రామ సమస్యలు పరిష్కారం కావడంతో కృతజ్ఞతలు తెలియజేశారు.


వైఎస్సార్ విగ్రహావిష్కరణలో రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు బొత్స, బూడి


సచివాలయం ప్రారంభోత్సవ శిలాఫలక ఆవిష్కరణలో...


ఆర్బీకే ప్రారంభోత్స శిలాఫలకం ఆవిష్కరణలో..


ఆర్బీకే భవన ప్రారంభోత్సవంలో..


ఇంటింటి కుళాయిని ప్రారంభిస్తున్న సుబ్బారెడ్డి

జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్‌లో వెటరన్ క్రీడాకారుల సత్తా

దేవరాపల్లి: జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్‌లో మండలానికి చెందిన నలుగురు వెటరన్ క్రీడాకారులు సత్తా చాటారు. విశాఖపట్నం పోలీస్ బ్యారెక్స్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్‌లో కాశీపురానికి చెందిన నెక్కెళ్ల దేముడు, ఆదిరెడ్డి చినకన్నబాబు, బోని సత్యవతి, వేచలంకు చెందిన బొడబల్ల సత్యం పలు విభాగాల్లో విశేష ప్రతిభ కనబరిచారు. వీరిలో రైతు నెక్కెళ్ల దేముడు 70 ఏళ్లకు పైబడిన విభాగంలో 5 కిలోమీటర్ల నడక, షార్ట్‌పుట్,100 మీటర్లు, 200 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. రిటైర్డ్ ఏఎస్‌డబ్ల్యువో ఆదిరెడ్డి చినకన్నబాబు 65 ఏళ్ల పైబడిన విభాగంలో 5 కిలోమీటర్ల నడకలో ద్వితీయ స్థానం, షార్ట్‌పుట్, 100 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. రిటైర్డ్ హెచ్‌ఎం బోని సత్యవతి 60 ఏళ్ల పైబడిన విభాగంలో షార్ట్‌పుట్, 100 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, 200 మీటర్ల రన్నింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచారు. రిటైర్డ్ హెచ్‌ఎం బొడబడల సత్యం 60 ఏళ్ల పైబడిన విభాగంలో 5 కిలోమీటర్ల నడక, 100 మీటర్ల రన్నింగ్‌లో తృతీయ స్థానం, షార్ట్‌పుట్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారు.


మెమెంటోలతో క్రీడాకారులు

నడక, పరుగు పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపిక

ఎస్.రాయవరం : జిల్లా మాస్టర్ అథెటిక్స్‌లో ఎస్.రాయవరానికి చెందిన బొజ్జా రామారావు నడక పోటీలో గోల్డ్ మెడల్, పరుగులో సిల్వర్ మెడల్ సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విశాఖ పోలీస్ బేరక్స్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన నడక, పరుగు పోటీల్లో రామారావు ప్రతిభ కనబరిచారు. 5 కిలో మీటర్ల నకడ, 100 పరుగులో పాల్గొని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రామారావు ఎస్.రాయవరం ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ టీచర్‌గా, ఉపాధ్యాయ సంఘ పీఆర్‌టీయు రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేస్తున్నారు.

జూలో ఉత్సాహంగా మారథాన్

ఆరిలోవ: ఇందిరాగాంధీ జూ పార్కులో ఈనెల 2న ప్రారంభమైన వన్యప్రాణి వారోత్సవాలు ఆదివారం ముగిశాయి. ఇందులో భాగంగా ఉదయం హాఫ్ మారథాన్ నిర్వహించారు. ఈ మారథాన్‌లో నగంలో పలు సంస్థలు నుంచి పెద్ద సంఖ్యలో వృద్ధులు, యువతీయువకులు, మహిళలు పాల్గొన్నారు. వారంతా ఉత్సాహంగా మారథాన్‌లో పాల్గొని జూలో సందడి చేశారు. మారథాన్‌లో విజేతలుగా నిలిచినవారికి సర్టిఫికెట్లు, ప్రశంసా పత్రాలను క్యూరేటర్ నందనీ సలారియా అందజేశారు. అనంతరం కోతుల జోన్ ఎదురుగా ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసిన వారోత్సవాల ముగింపులో ఇటీవల నిర్వహించిన పలు రకాల పోటీల్లో విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు ఆమె అందజేశారు.


విజేతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న జూ క్యూరేటర్ నందనీ సలారియా

మన్యంలో వీకెండ్ సందడి


వంజంగి హిల్స్‌పై ప్రకృతి అందాలను వీక్షిస్తున్న పర్యాటకులు


కొత్తపల్లి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు


చాపరాయిలో జలపాతం వద్ద పర్యాటకులు


సీతమ్మ పర్వతంపై ఏర్పాటు చేసిన గుడారాలు

సాక్షి,పాడేరు: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల్లో ఆదివారం సందడి నెలకొంది. వంజంగి హిల్స్, దల్లాపల్లి శిఖర ప్రాంతాల్లో సూర్యోదయం, పొగమంచు, మేఘాల అందాలను పర్యాటకులు తిలకించారు.

చాపరాయిలో..

దుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతానికి ఆదివారం మైదాన ప్రాంతం నుంచి పెద్ద సంఖ్యలో పర్యాటకులు ఉదయం ఆరు గంటలకు తరలివచ్చారు. స్నానాలు చేస్తూ సందడి చేశారు. చిరు వ్యాపారులకు మంచి ఆదాయం వచ్చింది.

అరకులోయలో..

అరకులోయ టౌన్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయకు పర్యాటకుల తాకిడి మొదలైంది. వారం రోజులుగా వీరి సంఖ్య పెరిగింది. గిరిజన మ్యూజియాన్ని సుమారు 1200 మంది, పద్మాపురం ఉద్యానవనాన్ని 520 మంది సందర్శించినట్లు సంబంధింత అధికారవర్గాలు తెలిపాయి.

కొత్తపల్లి జలపాతం వద్ద..

జి.మాడగుల: మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతానికి ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాల నుంచి పర్యాటకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశా రు. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ సందడి చేశారు.

జెండాకొండపై..

హుకుంపేట: రాష్ట్రంలో అత్యంత ఎతైన శిఖరంగా గుర్తింపు పొంది, పర్యటక ప్రాంతంగా అభివృద్ధి చెందుతున్న సీతమ్మపర్వతం (జెండా కొండ)పై ఆదివారం పర్యటకులు సందడి చేశారు. శనివారం రాత్రి ఓలుబెడ్డా గ్రామం మీదుగా కొండపైకి కాలినడకన వెళ్లారు. రాత్రి గుడారాలు ఏర్పాటు చేసుకుని బస చేశారు. సూర్యోదయం, మంచు అందాలను తిలకించారు. థింసా రాళ్లు, తేనెపట్టు గుహలను తిలకించారు.

అనంతగిరి: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకుల తాకిడి పెరిగింది.. గత రెండు నెలలుగా సందర్శిత ప్రాంతాలన్నీ వెలవెలబోయాయి. మన్యం అందాలను తిలకించేందుకు పర్యాటకులు వస్తుండడంతో పర్యాటక ప్రాంతాలు కళకళలాడుతున్నాయి. ఆదివారం గుహలను సుమారు రెండు వేలమంది తిలకించగా, రూ.1.53 లక్ష ఆదాయం వచ్చిందని సిబ్బంది తెలిపారు. తాటిగుడ, సరియా, కటికి, చిట్టంపాడు జలపాతాల వద్ద పర్యాటకులు సందడి చేశారు. డముకు వ్యూపాయింట్ నుంచి పర్యాటకులు ప్రకృతి అందాలను వీక్షించారు.


పర్యాటకులతో సందడిగా గిరిజన మ్యూజియం


సరియా జలపాతంలో పర్యాటకుల సందడి

పాపికొండలకు పర్యాటకుల తాకిడి

వీఆర్‌పురం: పాపికొండలకు పర్యాటకుల తాకిడి పెరిగింది.ఆదివారం పోచవరం బోట్ పాయింట్‌కు అధిక సంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. గతనెల వరకు గోదావరి వరదలతో పర్యాటకం నిలిచిపోయింది. ఈనెల ఒకటో తేదీ నుంచి పాపికొండల పర్యాటక బోటింగ్‌ను అధికారికంగా పునః ప్రారంభించారు. ప్రారంభంలో రెండు బోట్లు 100 మంది పర్యాటకులతో పాపికొండల వీక్షణకు వెళ్లేవి.ఆదివారం ఏడు బోట్లలో 360 మందికి పైగా పాపికొండల వీక్షణకు వెళ్లారని ఏపీ టూరిజం కౌంటర్ అసిస్టెంట్ సీహెచ్.రాజేష్ తెలిపారు. పర్యాటకులు అధిక సంఖ్యలో తరలిరావడంతో బోటింగ్ పాయింట్, పేరంటాలపల్లి శివాలయం ప్రాంతాల్లో సందడి నెలకొంది.


పోచవరం బోట్ పాయింట్ వద్ద పర్యాటకుల సందడి


బోట్‌పై ఎక్కిన పర్యాటకుల వద్ద వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

16 వరకు జన్మ భూమి ఎక్స్‌ప్రెస్ రద్దు

తాటిచెట్లపాలెం: గుంటూరు డివిజన్ పరిధిలో భద్రతా పనుల కారణంగా ఈ మార్గంలో జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌ను రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎ.కె.త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-లింగంపల్లి(12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 12 నుంచి 15వ తేదీ వరకు, లింగంపల్లి-విశాఖపట్నం (12806) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు రద్దు చేశారు.

కోణార్క్ ఎక్స్‌ప్రెస్ రీ షెడ్యూల్

ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయిలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరాల్సిన ఛత్రపతి శివాజీ టెర్మినస్ ముంబయి-భువనేశ్వర్ (11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్ పెయిరింగ్ రైలు రాక ఆలస్యంగా సాయంత్రం 4.40 గంటలకు బయలుదేరింది.

యువతికి సైబర్ వల

గూగుల్ హోటల్ రేటింగ్ పేరిట రూ.12.68 లక్షల హాంఫట్

అనకాపల్లి టౌన్: సైబర్ వలలో చిక్కుకున్న ఓ యువతి నిలువునా మోసపోయింది. గూగుల్ హోటల్ రేటింగ్‌లో డబ్బులు వస్తాయన్న ఆశతో అనకాపల్లి పట్టణం గవరపాలెంకు చెందిన మళ్ల జోతిర్మయి తన ఖాతా నుంచి రూ.రూ.12.68 లక్షలు పోగొట్టుకుంది. దీంతో లబోదిబోమంటూ పట్టణ పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. సీఐ దాడి మోహనరావు వివరాల ప్రకారం.. బీటెక్ వరకు చదువుకున్న ఆమె ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం అమెరికా వెళ్లేందుకు గత నెల 24న ఎడ్యుకేషన్ లోన్ కింద బ్యాంకులో రూ.25 లక్షలు తీసుకుంది. ఈ క్రమంలో గూగుల్‌లో పార్టుటైం జాబ్‌ల కోసం సెర్చ్ చేస్తుండగా, హోటల్ రేటింగ్ చూసింది. దాన్ని క్లిక్ చేయగా మెసెజ్ వచ్చింది. ఆ ప్రకారం రూ.5 వేలు చెల్లించి సభ్యత్వం తీసుకుంది. వెంటనే ఆమె ఖాతాలో రూ.5 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు జమయ్యాయి. దాంతో ఆమెకు మరింత ఆశ పుట్టింది. ఆ తర్వాత రూ.20 వేలు చెల్లించగా, ఈ మొత్తానికి రేటింగ్ ఇవ్వడం సాధ్యం కాదని, మరో రూ.45 వేలు చెల్లించాలని మెసెజ్ వచ్చింది. ఆ ప్రకారం చెల్లించగా, మొత్తం అమౌంట్ రూ.65 రిటర్న్ రాకపోవంతో తను మెసెజ్ పంపింది. ఈ అకౌంట్ క్లోజ్ అయిందని, కొత్త అకౌంట్ ఓపెన్ చేయాలని చెప్పి దఫదఫాలుగా లక్ష రూపాయల నుంచి విడతల వారీగా ఆదేరోజు మొత్తం రూ.12.68 లక్షలు లాగేశాడు. ఈ మొత్తం రావాలంటే మరో రూ.3 లక్షలు చెల్లిస్తే రూ.10 లక్షల వరకు వస్తుందని సైబర్ మోసగాడు నమ్మబలికాడు. దాంతో అనుమానం వచ్చిన సదరు యువతి తన అన్నయ్య కేశవనాయుడుకు విషయం చెప్పింది. దాంతో మోసపోయినట్లు చెప్పడంతో బాధితురాలు జ్యోతిర్మయి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

నలుగురు గంజాయి నిందితుల అరెస్టు

24 కిలోల గంజాయి, రూ.45 వేలు స్వాధీనం

మాడుగుల రూరల్: చీడికాడ మండలం అర్జునగిరి గ్రామం వద్ద అంతరాష్ట్ర గంజాయి స్మగ్లర్లను ఆదివారం ఉదయం పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి 24 కిలోల గంజాయి, రూ.45 వేలు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. మాడుగుల మండలం ఎం. కోటపాడుకు చెందిన శానాపతి రమేష్, అర్జునగిరికి చెందిన గంజి సింహాచలంనాయుడు ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చారు. వీరు అర్జునగిరి వద్ద తమిళనాడు రాష్ట్రం చెన్నై సమీపంలోని ఎర్నూర్‌కు చెందిన ఎస్. దీపక్, తిరువళ్లూరు చెందిన ఎస్. భరత్‌లకు విక్రయిస్తుండగా అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు చీడికాడ ఎస్‌ఐ పి. రామారావు తెలిపారు.


స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో గాజువాక గణపతి

గాజువాక: గాజువాక లంకా మైదానంలో కొలువుదీరిన 117 అడుగుల పంచముఖ మహాగణపతి ప్రపంచంలో ఎత్తయిన గణనాథునిగా రికార్డుల్లోకి ఎక్కాడు. ఇప్పటివరకు ఎత్తయిన గణపతిగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో మహారాష్ట్రలో బంగారంతో తయారు చేసిన 102 అడుగుల గణేశునికి స్థానం ఉంది. ఇప్పుడు ఆ రికార్డును సొంతం చేసుకున్నట్టు వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి వీరుమామ ధ్రువీకరించారు. ఈ మేరకు సంబంధించిన ధ్రువీకరణ పత్రం, బంగారు పతకం, ప్రశంసా పత్రాన్ని ఆదివారం ఉత్సవ నిర్వాహకుడు కొసిరెడ్డి గణేష్‌కు అందజేశారు. విగ్రహ శిల్పి మహేష్‌ను అభినందించారు.


పంచముఖ మహాగణపతి

బండారూ నోరు అదుపులో పెట్టుకో

- లేకపోతే తగిన బుద్ధి చెబుతాం
- ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ

నక్కపల్లి/పాయకరావుపేట : మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి గానీ ఇతర టీడీపీ నాయకులు గాని నోరు అదుపులో పెట్టుకోకపోతే నడిరోడ్డుపై తగిన బుద్ధి చెప్పాల్సి వస్తుందని ఎస్సీ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పెదపాటి అమ్మాజీ హెచ్చరించారు. ఆదివారం ఆమె పాయకరావుపేటలో విలేకర్లతో మాట్లాడుతూ మంత్రి రోజాపై బండారు సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. మనిషన్నవాడు అలా మాట్లాడతారా? అని ప్రశ్నించారు. ఇటువంటి వ్యాఖ్యలు బండారు కుటుంబలో ఉన్న ఆడవాళ్లపై చేస్తే బాధ ఎలా ఉంటుందో తెలుస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీలో ఉన్న మహిళా ఎమ్మెల్యేలు, మంత్రులు, నాయకులపై టీడీపీ నాయకులు ఇటీవల ఇష్టాను సారం నోరు పారేసుకుంటున్నారన్నారు. పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. భారతదేశంలో మహిళలకు ఎంతో గౌరవం ఉందని, ప్రపంచ దేశాలన్నీ భారత స్త్రీలను ఎంతో గౌరవిస్తుంటే తెలుగుదేశం పార్టీ మాత్రం నీచంగా మాట్లాడుతుందన్నారు. చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాములో రూ.375 కోట్లు లూటీ చేసిన విషయం వాస్తవమేనన్నారు. అన్ని ఆధారాలతోనే సీఐడీ కేసులు నమోదు చేసి అరెస్టు చేసిందన్నారు. కేసులకు భయపడే లోకేష్ ఢిల్లీలో దాక్కుంటున్నారన్నారు. తండ్రి బెయిల్‌కోసం ఢిల్లీ పెద్దల కాళ్లు పట్టుకునేందుకు వెంపర్లాడుతున్నారన్నారు. ఇటువంటి అవినీతి పరులు జగనన్న ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటన్నారు. నిప్పు, తుప్పుల సంగతి రాష్ట్ర ప్రజలకు తెలిసిపోయిందన్నారు. టీడీపీని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. ఎన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా వచ్చే ఎన్నికల్లో సీఎం అయ్యేది జగనన్నే అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు మేఘరంజన్, అనిశెట్టి వెంకటసూరి పాల్గొన్నారు.


విలేకర్లతో మాట్లాడుతున్న పెదపాటి అమ్మాజీ

స్థల వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

- ముగ్గురికి గాయాలు
- 15 మందిపై కేసు నమోదు

దేవరాపల్లి: మండలంలోని తామరబ్బలో ఇంటి స్థల వివాదం ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారితీసింది. ఆదివారం చోటు చేసుకున్న ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ డి. నాగేంద్ర వివరాల ప్రకారం... ఇంటి స్థలం కోసం జంబు రాజులమ్మ, శెట్టి పార్వతి కుటుంబాల మధ్య వివాదం చెలరేగింది. ఈ వివాదంలో ఇరువర్గాలు ఒకరిపై మరొకరు దాడులకు తెగబడ్డారు. ఈ ఘటనలో జంబు రాజులమ్మ వర్గానికి చెందిన గుమ్మడపు మహేశ్వరరావుకు కన్నుపైన, గుమ్మడపు జయరాజు తలపైన తీవ్ర గాయాలయ్యాయి. ఇదే ఘటనలో శెట్టి పార్వతి వర్గానికి చెందిన సన్యాసి రావు తలపై గాయమైంది. జంబు రాజులమ్మ ఫిర్యాదు మేరకు శెట్టి మంగరాజు, సన్యాసి రావు, అప్పలకొండ, వరలక్ష్మి, శ్యామల, పార్వతి, ఉషారాణిలపై కేసు నమోదు చేశారు. మరో వర్గం శెట్టి పార్వతి ఫిర్యాదు మేరకు జి. మహేశ్వరావు, జయరాజు, పైడిరాజు, దేవి, కన్నమ్మ, రాజులమ్మ, ఈశ్వరమ్మ, రాజులమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


గాయపడిన గుమ్మడపు మహేశ్వరరావు

రోలర్‌స్కీ నేషనల్ చాంపియన్‌షిప్‌లో విశాఖ సత్తా

దొండపర్తి: రోలర్‌స్కీ నేషనల్ చాంపియన్‌షిప్‌లో విశాఖ క్రీడాకారులు సత్తా చాటారు. గుజరాత్‌లోని బరోడాలో ఈ నెల 6, 7, 8 తేదీల్లో నేషనల్ చాంపియన్ షిప్ జరిగింది. ఇందులో విశాఖకు చెందిన వి.ఉదయశ్రీ తేజ మూడు బంగారు పతకాలు సాధించగా, ఆర్.చాణక్య రెండు స్వర్ణాలు, ఒక రజతం కైవసం చేసుకున్నారు. జి.నూతన్ మూడు స్వర్ణాలు సాధించారు. కోచ్ మురళీ ఆధ్వర్యంలో ఏపీకి ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కింది. ఏపీ రోలర్ స్కీ ఫౌండర్ సురేంద్ర రెడ్డి ప్రోత్సాహంతో ఈ ఫలితాలు సొంతమయ్యాయని కోచ్ మురళీ తెలిపారు. స్వర్ణ, రజత పతకాలు సాధించిన క్రీడాకారులను సురేంద్రరెడ్డి అభినందించారు.


విజేతలతో కోచ్ మురళీ, రోలర్‌స్కీ ఫౌండర్ సురేంద్రరెడ్డి

క్లుప్తంగా

వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడిగా యల్లపు


శివను శాలువాతో సత్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: అనకాపల్లి వాకర్స్‌క్లబ్ అధ్యక్షుడిగా యల్లపు సాంబశివరావు(శివ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ఆదివారం జరిగిన ఎన్నికల్లో కార్యదర్శిగా భీశెట్టి రామకృష్ణ, కోశాధికారిగా రాపేటి నారాయణరావు నియమితులయ్యారు. ఈ సందర్భంగా సాంబశివరావు మాట్లాడుతూ 2024 ఏడాదికి ఎన్నికైన ఈ నూతన కమిటీ ఏడాదిపాటు మనుగడలో ఉంటుందన్నారు. కమిటీ సభ్యుల సహకారంలో క్లబ్ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని పేర్కొన్నారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన శివను క్లబ్ సభ్యులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యులు కేవీ గౌరీపతి, బీవీ రమణ, నల్లల దేముళ్లు, బుద్ధ అప్పారావు, ఎస్.నూకరాజు, బుద్ధ శ్రీనివాసరావు, చవితిని నర్సింగరావు, బొడ్డేడ శేషు తదితరులు పాల్గొన్నారు.

నేడు శరీర, అవయవ దాతల సంఘ వ్యవస్థాపక వేడుకలు

అనకాపల్లిటౌన్: గవరపాలెం సుంకరమెట్ట జంక్షన్ యల్లపు ఉమామహేశ్వరి ఇంటి ఆవరణలో సోమవారం సాయంత్రం 4 గంటలకు శరీర, అవయవ దాన వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు జి.సీతా మహాలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.హేమంత్, జిల్లా ఖజానాశాఖ అధికారి వీవి సుభాషిణి హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

అనకాపల్లి సినిమాలు

మ్యాడ్	:రాజా
స్కంద	:సత్యనారాయణస్క్రీన్-1
మంత్ ఆఫ్ మధు	:సత్యనారాయణస్క్రీన్-2
మామా మశ్చీంద్ర	: షిర్డిసాయి
రూల్స్ రంజన్	:పర్తిసాయి
ది ఎక్స్పార్సిస్ట్: బిలీవర్	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
చంద్రముఖి-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-12 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-10 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 305 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 267 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

గర్భిణుల ఆకలి తీర్చే 'అన్నపూర్ణ'

మనిషి ఆశకు అంతులేదు. ఏది దానంగా ఇచ్చినా.. ఇంకా ఇంకా కావాలనే అనిపిస్తుంది. అన్నదానంలో మాత్రం దానం తీసుకున్నవారు ఇంక చాలు అని సంతృప్తి చెందుతారు. అన్నదానాన్ని ఒక యజ్ఞంలా భావించి చేసేవారు ఉన్నారు. ఆ కోవలోనిదే సత్యసాయి సేవా సంస్థకు చెందిన అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్టు. ఐదేళ్లుగా జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ వైద్యాలయానికి వచ్చే గర్భిణులకు అవసరమైన ఆహారాన్ని అందిస్తూ విశేష సేవ చేస్తోంది.

- ఎన్టీఆర్ ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ఉచిత భోజనం
- రోజూ 200 మందికి అందిస్తోన్న సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్
- నెలకు సుమారు రూ.2.10 లక్షల వ్యయంతో నిర్వహణ


అన్న ప్రసాదాన్ని వడ్డిస్తున్న సత్యసాయి ట్రస్టు సేవకులు


సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ నిత్యాన్నదాన హాల్లో ఆహారం తీసుకుంటున్న గర్భిణులు

అనకాపల్లి రూరల్: అన్నదానం మహాదానం. పైసా ఆశించకుండా ఒకరి ఆకలి తీర్చడం.. కృతజ్ఞత కోరుకోకుండా నిస్సహాయుల కడుపు నింపడాన్ని మించిన సేవ ఇంకేముంటుంది. ఐదేళ్లుగా సత్యసాయి సేవా సంస్థ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ వైద్యాలయంలో ఇలాంటి సేవలే చేస్తోంది. రోజూ జిల్లా నలుమూలల నుంచి ఈ ఆస్పత్రికి వచ్చే వందలాది గర్భిణులు ఇబ్బంది పడకుండా వారి ఆకలి తీరుస్తోంది.. సత్యసాయి అన్నపూర్ణ చారిటబుల్ ట్రస్ట్. నెలకు సుమారు రూ.210 లక్షలకు పైగా వ్యయంతో అన్నదాన సేవ చేస్తోంది.

రోజూ 200 మందికి..

జిల్లా నలుమూలల నుంచి నిత్యం వెయ్యి నుంచి 1,500 మంది వరకు సాధారణ ఓపీ కోసం వస్తుంటారు. వీరిలో దాదాపు 200 మంది గర్భిణులు ఉంటారు. వీరు ఉదయాన్నే ఎలాంటి ఆహారం తీసుకోకుండా వస్తారు. వైద్య పరీక్షలు చేయించుకుని తిరుగుముఖం పట్టేసరికి మధ్యాహ్నం 12 గంటలు దాటుతుంది. దీంతో వారు ఆకలితో అలమటించే పరిస్థితి. ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతున్న వారికి పోషక విలువలున్న ఆహారాన్ని ప్రభుత్వమే ఉచితంగా అందిస్తుంది. రోజూ దూర ప్రాంతాల నుంచి వచ్చే గర్భిణుల ఆకలి తీర్చడానికి సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ ఇక్కడ నిత్య అన్నదాన సేవ చేపడుతోంది. 2018లో ప్రారంభించిన ఈ ఉచిత అన్నదాన పథకం ఐదేళ్లుగా నిరాటంకంగా కొనసాగుతోంది. ఆస్పత్రి అత్యవసర సేవల విభాగానికి సమీపంలో అన్నదాన పథకాన్ని నిర్వహించేందుకు అవసరమైన వసతులతో కూడిన ప్రత్యేక భవనాన్ని సైతం ట్రస్టీల ఆర్థిక సహకారంతో నిర్మించారు. ప్రస్తుతం 9 మంది ట్రస్టీలతో పాటు, దాతలు ఇస్తున్న నిధులతో రోజూ సగటున 200 మందికి రుచికరమైన భోజనాన్ని పెడుతున్నారు.

రుచికరం.. ఆరోగ్యం

వైద్యం కోసం ఆస్పత్రికి వచ్చే గర్భిణులకు ఓపీ కౌంటర్ వద్ద భోజన టోకెన్లు జారీ చేసేలా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. ఎంత మంది వచ్చినా భోజనం అప్పటికప్పుడే వండి పెట్టేలా స్టీమర్లను ఏర్పాటు చేశారు. వేడివేడి అన్నం, ఆకుకూర పప్పు, వెజిటబుల్ కర్రీ, సాంబారు, పచ్చడి, మజ్జిగతో పాటు రక్షిత నీటిని అందించేందుకు ఆర్వో ప్లాంటు కూడా వుంది. వారానికి రెండు రోజులు రోజువారీ మెనూతో పాటు పులిహోర, బెల్లం పరమాన్నం వంటి ప్రత్యేక వంటకాలు కూడా అందిస్తున్నారు. ట్రస్టీల్లో ప్రధానంగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిత్యం స్వయంగా పర్యవేక్షించే విల్లూరి మోదినాయుడుకు అనకాపల్లి మార్కెట్లో సాయిరాం వెజిటబుల్స్ హోల్‌సేల్ దుకాణం వుంది. రోజూ భోజన పథకానికి అవసరమైన కూరగాయలను ఆ దుకాణం నుంచే అందించడం విశేషం. భోజనం కోసం తమ వద్దకు వచ్చే వారికి లేదనకుండా వండి పెట్టడం వెనుక నిర్వాహకుల కృషిని పలువురు ప్రశంసిస్తున్నారు.


భోజనం చేస్తున్న గర్భిణులు

ఆకలితో వెళ్లే పరిస్థితి లేదు



మా ఊరిలో ఉదయం 7 గంటలకు బయలుదేరి ఆస్పత్రికి వచ్చాను. టెస్టులు చేస్తారని ఏమీ తినకుండానే వచ్చాను. వైద్య పరీక్షలన్నీ పూర్తయ్యేసరికి మధ్యాహ్నం 12.30 గంటలు దాటింది. ఆకలితో ఇక్కడకు వస్తే భోజనం పెట్టారు. ఇప్పటికి రెండుసార్లు ఇక్కడ భోజనం చేశాను. అడిగి మరీ వడ్డిస్తారు. అన్ని పదార్థాలూ రుచికరంగా, మన ఇంట్లో వండుకున్నట్టే ఉన్నాయి.

– ముచ్చకర్ల ధనలక్ష్మి, పెదకలవలాపల్లి, రాంబిల్లి మండలం

భోజనం బాగుంది



ప్రతి నెలా పరీక్షల కోసం ఇక్కడకు వస్తాను. ఓపీ కౌంటర్లో భోజన టోకెన్ ఇచ్చారు. టెస్టులు చేయించుకుని బయటకు వచ్చేసరికి ఇక్కడ మంచి భోజనం ఉచితంగా పెట్టారు. నాతోపాటు ఆస్పత్రికొచ్చిన కొందరు నిరుపేద మహిళలు చార్జీలకు మాత్రమే డబ్బులు తీసుకొచ్చారు. అలాంటివారికి ఈ కార్యక్రమం చాలా బాగా ఉపయోగపడుతుంది. భోజన పదార్థాలు కూడా బాగున్నాయి.

– కె.వేణి, ఎర్రవరం, యలమంచిలి మున్సిపాలిటీ

నిరంతరం కొనసాగిస్తాం



ఆస్పత్రికి ప్రతి నెలా చెకింగ్ కోసం వచ్చే గర్భిణులకు మా వంతు సాయం చేస్తున్నాం. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదానాన్ని నిరంతరం కొనసాగిస్తాం. కార్యక్రమం ప్రారంభించినప్పటి నుంచి ఎందరో మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు. పలువురు దాతలు సాయం చేస్తున్నారు. కొందరు తమ పేరు చెప్పు కోరుకూడా. ఈ సేవా కార్యక్రమానికి వారిచ్చిన నిధులు కూడా ఉపయోగపడుతున్నాయి.

– విల్లూరి మోదినాయుడు, సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్, అనకాపల్లి

15 నుంచి దత్తక్షేత్రంలో దేవీ నవరాత్రులు


సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయరాజు

అనకాపల్లిటౌన్: జీవీఎంసీ విలీన గ్రామం సిరసపల్లి చింతామణి గణపతి దత్తక్షేత్రంలో దేవీనవరాత్రుల ఉత్సవాలను ఈ నెల 15 నుంచి ప్రారంభించనున్నట్లు ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఎం.ఆంజనేయ రాజు, స్థలదాత సీపీ రామారావు తెలిపారు. దత్తక్షేత్ర ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవీ నవరాత్రులను పురస్కరించుకుని తొమ్మిది రోజులు అమ్మవారికి ప్రత్యేక కుంకుమపూజలు, హోమాలు, చండీపారాయణ, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. సమావేశంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

జెడ్పీ నిధులతో డ్రైనేజీ, తాగునీటి బోర్లు

అనకాపల్లిటౌన్: మండలంలోని పలు ప్రాంతాల్లో డ్రైనేజీ, తాగునీటి బోర్ల ఏర్పాటుకు జిల్లా పరిషత్ నిధులు రూ.23 లక్షలు మంజూరైనట్లు జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు పీఎస్ఎస్ జోసెఫ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఆదేశాల మేరకు వారం రోజుల్లో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో దర్జీనగర్ నుంచి బవులవాడ డ్రైనేజీకి రూ.5 లక్షలు, మూలపేట నుంచి సత్యనారాయణ పురానికి రూ.5 లక్షలు, రేబాక గ్రామంలో రూ.5 లక్షలు, రామాపురం ఎస్సీకాలనీ నుంచి కొత్తూరు రూ.6 లక్షలు, ముత్రాస్‌కాలనీ, కొత్తూరు, వెంకుపాలెం, మోదకొండమ్మతల్లి గుడి ప్రాంతాల్లో తాగునీటి బోర్ల ఏర్పాటుకు రూ.2 లక్షల నిధులు వెచ్చించనున్నట్లు వెల్లడించారు.

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు

అనకాపల్లిటౌన్: మండలంలోని తుమ్మపాల-2 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి వాణీజగదీశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వైద్యశిబిరంలో నలుగురు స్పెషలిస్టు వైద్యులు, పీహెచ్‌సీ వైద్యులు పాల్గొని కంటి పరీక్షలు, రక్తపరీక్షలు, ఉచితంగా మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే ఇంటింటా సమగ్ర ఆరోగ్య సర్వేలో గుర్తించి టోకెన్లు జారీ చేసిన రోగులతోపాటు, శిబిరానికి వచ్చే వారు కూడా స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకుని, వైద్య సేవలు పొందవచ్చన్నారు.

చింతపాలెం సచివాలయంలో..

కశింకోట: మండలంలోని చింతలపాలెం సచివాలయంలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం వరకు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరగనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వి.వి.రవికుమార్ ఆదివారం తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు, పీహెచ్‌సీ వైద్యులు హాజరై రోగుల్ని పరీక్షించి అవసరమైన, అవసరమైన వైద్యం, మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సచివాలయ పరిధిలోని ప్రజలంతా వినియోగించుకోవాల్సిందిగా ఆయన కోరారు.

నేడు సెపక్‌తక్రా ఎంపిక పోటీలు

కశింకోట: మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట ప్రభుత్వ హైస్కూల్లో సోమవారం బాల బాలికల సెపక్‌తక్రా బాల్ గేమ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరగనున్నట్లు పీడీ జి.నూకరాజు తెలిపారు. 14 ఏళ్ల, 17 ఏళ్లలోపు విభాగాల్లో సెలక్షన్స్ జరుగుతాయన్నారు. ఇక్కడ ఎంపిక చేసిన జట్లను స్టేట్ మీట్‌కు పంపిస్తామన్నారు.

పారదర్శకంగా ఉపాధి పనుల సామాజిక తనిఖీ


కశింకోట సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కలగా లక్ష్మి

కశింకోట: జాతీయ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ పారదర్శకంగా జరపాలని ఎంపీపీ కలగా లక్ష్మి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం సామాజిక తనిఖీ బృందం, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి సిబ్బందికి నిర్వహించిన సమన్వయ సమావేశంలో మాట్లాడారు. సోమవారం నుంచి ఆడిట్ నిర్వహించే సామాజిక తనిఖీ బృందానికి సిబ్బంది సహకారం అందించాలన్నారు. తనిఖీలో బయటపడిన లోటుపాట్లను గ్రామ సభలు, ప్రజా వేదికల దృష్టికి తప్పక తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీవీ రవికుమార్ మాట్లాడుతూ 2022-23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన రూ.9.96 కోట్ల ఉపాధి పనులకు సంబంధించి సామాజిక తనిఖీ జరగనుందన్నారు. ఈ సందర్భంగా గ్రామాలకు వచ్చే సామాజిక తనిఖీ సిబ్బందికి వసతి ఏర్పాట్లు చేయాలని, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని ఆడిట్ పూర్తి చేయాల్సిందిగా సిబ్బందికి సూచించారు. వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు మాట్లాడుతూ పూర్తిగా రికార్డులను అందించి సామాజిక తనిఖీ సవ్యంగా జరిగేలా సహకరించాలన్నారు. సమావేశంలో ఉపాధి పథకం ఏపీవో శివ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సామాజిక తనిఖీ సిబ్బంది, ఉపాధి పథకం సిబ్బంది పాల్గొన్నారు.

సర్వకామదాంబకు నిమ్మకాయల పూజ


ప్రత్యేక అలంకరణలో సర్వకామదాంబ అమ్మవారు


సామూహిక పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళా భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక సర్వకామదాంబ సమేత భోగలింగేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం అమ్మవారికి నిమ్మకాయల పూజ నేత్రపర్వంగా జరిపారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. కనకదుర్గమ్మ మాలధారణ, సామూహిక కుంకుమార్చనలు, లలితా సహస్రనామార్చన, విజయదశమి రోజున జమ్మి పూజ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు, మహిళా భక్తులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


మునగపాక బీసీ కాలనీలో డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక : గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామాల్లో అభివృద్ధికి అవకాశం ఏర్పడిందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మునగపాక సచివాలయానికి కేటాయించిన రూ.20 లక్షల వ్యయంతో బీసీ కాలనీలో నాలుగు చోట్ల డ్రైన్లు నిర్మాణానికి ఆదివారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సచివాలయానికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ.20 లక్షల మేర నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఆ నిధులతో పలు చోట్ల అభివృద్ధి జరుగుతుందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకోవాలన్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడుపాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. అపురూప వేడుక


అడ్డూరు మద్దిగైరమ్మ గుడివద్ద కలుసుకున్న పూర్వ విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి శివారు రావలమ్మపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం అట్టహాసంగా జరిగింది. పాఠశాలలో 1989-90లో పదో తరగతి పూర్తి చేసిన వీరంతా అడ్డూరులోని మద్ది గైరమ్మ గుడి ఆవరణలో కలిశారు. సుమారు 33 ఏళ్ల కిందట ఆ పాఠశాలలో చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడినవారంతా కలుసుకున్నారు. చిన్ననాటి మధుర జ్ఞాపకాలను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. గ్రూపు ఫొటోలు తీసుకొని సందడి చేశారు. చదువు చెప్పిన గురువులు సైన్స్ టీచర్ ప్రకాష్, తెలుగు టీచర్ ఏసుదాసు, సోషల్ టీచర్ విష్ణు మాస్టర్లను పూర్వ విద్యార్థులంతా ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో సబ్బవరం ఎంపీటీసీ బైలపూడి దేముడుబాబు, అన్నంరెడ్డి రమణమ్మ, జక్కాన సత్యవతి, కర్రి సన్యాసమ్మ, కామిరెడ్డి శ్రీనివాసరావు, గండి అప్పలనాయుడు, పంచదార్ల రమణ, గండి నాగరాజు, కొల్లి దేముడుబాబు, సబ్బవరపు నాయుడు, సబ్బవరపు వెంకట రమణ తదితరులు ఉన్నారు.

400 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్ అపెరల్ సిటీలో ఆదివారం నిర్వహించిన 115వ ఉచిత కంటి వైద్య శిబిరంలో 400 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 289 మందికి ఉచితంగా కళ్లద్దాలు అందజేశారు. 73 మందికి మందులు పంపిణీ చేశారు. 50 మందికి కాటరాక్ట్ సర్జరీ అవసరమని సూచించారు. రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 15 మంది రక్తదానం చేశారు. శిబిరానికి విచ్చేసిన వారికి ఫలహారం, భోజనం, మజ్జిగ సమకూర్చారు. బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వినాయక పందిళ్ల వద్ద అన్న సమారాధనలు


వరసిద్ధి వినాయకుడి పందిరి వద్ద అన్నప్రసాద వితరణ చేస్తున్న దాడి రత్నాకర్


వినాయకుడిని దర్శించుకుంటున్న లగిశెట్టి గణేష్, తదితరులు

తుమ్మపాల: వినాయక నవరాత్రులు పురస్కరించుకుని పట్టణంలో భక్తులు ఏర్పాటుచేసిన వినాయక చవితి పందిళ్ల వద్ద ఆదివారం భారీ అన్న సమారాధనలు జరిగాయి. గవరపాలెం దాడి వారి వీధిలో శ్రీవరసిద్ధి వినాయకుడిని వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు దాడి రత్నాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని ఉత్సవ కమిటీ సభ్యులు దుశ్శాలువాతో సత్కరించారు. మండలంలోని రేబాక గ్రామంలో శ్రీకనకదుర్గ ఆటో స్టాండ్ ఆధ్వర్యంలో వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధన అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారిని ఘనంగా ఊరేగించి, నిమజ్జనం చేశారు.

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్యపేటలో బాల గణపతి యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ అన్న సమారాధన జరిపారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ దర్శించుకుని, విగ్రహానికి పూజలు చేశారు. రాష్ట్ర తెలుగు రైతు అధికార ప్రతినిధి గొంతిన శ్రీనివాసరావు, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి ఉగ్గిన రమణమూర్తి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఆంధ్ర ప్రసాద్ తదితరులు దర్శించుకున్నారు.

నాగులాపల్లి హైస్కూల్లో కత్తి యుద్ధంలో శిక్షణ

మునగపాక: మండలంలోని నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆదివారం కత్తియుద్ధంపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. హైస్కూల్లో పీటీగా సేవలందిస్తున్న ఎం.సూర్య శిక్షణ ఇస్తున్నారు. క్రీడారంగంలో ప్రాముఖ్యత కలిగిన ప్రాచీన కత్తి యుద్ధంలో శిక్షణ సద్వినియోగం చేసుకోవాలని సూర్య కోరారు.

ముగిసిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

యలమంచిలి : మండలంలో పద్మనాభరాజుపేట, బయ్యవరం గ్రామాల్లో వినాయక ఉత్సవాలు పురస్కరించుకుని మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు శనివారంతో ముగిశాయి. అత్యంత రసవత్తరంగా జరిగిన ఫైనల్ పోటీలలో అల్లూరి జిల్లా, గంగవరం జట్ల మధ్య జరిగిన పోరులో అల్లూరి జిల్లా జట్టు ప్రథమ స్థానం, గంగవరం జట్టు ద్వితీయ స్థానం, సోమలింగపాలెం జట్టు తృతీయ స్థానం దక్కించుకున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు మొగలిపల్లి గణేష్, చంద్రగిరి నాని ఆదివారం తెలిపారు. ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో హోరాహోరీగా జరిగిన ఈ పోటీలు తిలకించడానికి రెండు గ్రామాల ప్రజలు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. పోటీల్లో మొదటి స్థానం పొందిన జట్టుకు రూ.15 వేలు నగదు, ద్వితీయస్థానం జట్టుకు రూ.12వేలు, తృతీయస్థానం జట్టుకు రూ.10వేలు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గొన్నాబత్తుల శివ, మొగ్గా గోవిందరావు, ఊటకూటి శేఖర్, జెర్రిపోతుల వెంకట్, ఊటకూటి బాబ్జి పాల్గొన్నారు.

తీరంలో సండే సందడి


తిక్కవానిపాలెం తీరంలో సందర్శకులు

పరవాడ: మండలంలోని ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం తీర ప్రాంతాలు పర్యాటకులతో సందడిగా మారాయి. గాజువాక, స్టీల్‌ప్లాంట్, సబ్బవరం, లంకెలపాలెం, అనకాపల్లి, పరవాడ, దీపాంజలినగర్ వంటి పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన సందర్శకులతో ఆదివారం రెండు బీచ్‌లు కళకళలాడాయి. పర్యాటకులు తీర ప్రాంతాల్లోని జీడి, సరుగుడు తోటల వద్ద గడిపి అనంతరం బీచ్‌ల్లో ఇసుక మేటల్లో ఆట పాటలతో సందడి చేశారు. సాయంత్రం తీరంలో జలకాలాటలతో కేరింతలు కొట్టారు. తిక్కవానిపాలెం బీచ్‌లో తాగునీటి సదుపాయం లేక సందర్శకులు అవస్థలు పడుతున్నారు. ముత్యాలమ్మపాలెం తీరంలో నీడ ఉండేలా అభివృద్ధి చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.